భారత గ్రంథమాల
కవి పరిచయం—1

భగవద్గీతామృతసారము

★

రచయిత

మధురకవి

శ్రీ కాకాని నరసింహారావు

★

ప్రకాశకుడు

చతుర్వేదుల పార్థసారథి

గుంటూరు 1

చందా రేటు రు 1-00]   [విడిప్రతి రు 1-50 పై

ప్రథమ ముద్రణ 1972

ప్రతులు 1000

ముద్రణ

[illegible] ప్రింటింగ్ అండ్ బైండింగ్ వర్క్సు

లాలాపేట గుంటూరు-౨

ఉపోద్ఘాతము

శ్రీమద్భగవద్గీత ఆర్ష మతబోధాత్మక గ్రంథములలో ఉత్తమోత్తమము అదియొక పెన్నిధి ఒక మహాద్భుత రత్నాకరము అందలి రత్నములు విలువ ఊహాతీతము ఈ లోకోత్తర గ్రంథము విశ్వసాహిత్యమున నిరుపమాన కాంతితో నిత్యశోభాయమానమై వెలుగొందుచున్నది ఇందలి సందేశము అనంతము నిత్యసత్యము మానవాళికి తరణోపాయముగీత గీత వినా మానవులకు మిత్రుడు గురువు మార్గదర్శిలేదు ప్రపంచసాహిత్యములో గీతతో తులతూగగల గ్రంథములేదు ముందు కలుగదు నభూతోనభవిష్యతి జ్ఞానసముపార్జనకు మానవులు నిత్యము పారాయణ చేయదగిన గ్రంథము గీత గీత చదువనివాడు చదివి విజ్ఞానమందనివాడు దురదృష్టవంతుడు గీత జ్ఞానజ్యోతి మానవుని దివ్యమొనర్చును మరణభీతిని మాన్పును విశ్వసాహిత్యమందలి ఉత్తమోత్తమ వేదాంత గ్రంథరాజము గీత సకలశాస్త్రముల వేదాంతముల సారాంశము గీత

ప్రపంచములోని మహాత్ములందరు ఏకకంఠముతో గీత లోకోత్తర గ్రంథమని ప్రస్తుతించిరి గీత నెరుగనివారు మానవులు కాదనిరి స్వామి వివేకానందుడు ఆర్యులు పాశ్చాత్యదేశముల కొసగిన సందేశము "గీత అని చాటెను గీత ఉత్కృష్టతను గీతలోని పరమార్థమును సర్వులు శిరసావహించినారు త్రిమతాచార్యులేగాక ఎందరో విజ్ఞానధనులు విద్యావిశారదులు మహాత్ములు లోకమాన్యులు విదుషీమణులు ఆంగ్లభాషా పారంగ

తులు గీతకు భాష్యములు వ్రాసినారు గీత అనువదించినారు వ్యాఖ్యానించినారు

ఆ ఉద్గ్రంథములన్నియు నిత్యము పారాయణము చేయుట క్షేమాకరము అభిలషణీయము కాని అందరకు సాధ్యముగాదు అవకాశములేదు కావున గీతామృత సారము సంగ్రహముగా తెలిపిన భగవద్గీత గొప్పదనము మహామను సోదరాంధ్రుల తెల్సి గీతాపర మొందు ఆసక్తి కల్పించుట నా ధర్మమని భావించి నా అసమర్థతను అశక్తతను గణింపక ఇట్టి గీతామృతసారమును మాతృభాషలో తెలుప సాహసించితిని సోదరాంధ్రుల ఆదరణకియ్యది పాత్రమగునని విశ్వసించుచున్నాను ఇందలి దోసగులను విజ్ఞులు తెలిపిన కృతజ్ఞతతో సవరించుకొందును

భగవద్గీతా ప్రాశస్త్యము

ఉ. వేదమునందు కలవిది విశ్వమునందున లేదు వేదమే
పాదు సమస్త విద్యలకు స్వామి స్వయమ్ముగ వేదసారమౌ
మోహమునన్ వచించె నరుమోహము శోకము తీర్ప వ్యాసుడే
స్వాదుమరందశైలి సరసమ్ముగ పాడెను వేల్పు పాటగా

వేదములు అనంతములు వేదములో లేనిది ప్రపంచములో లేదు వేదమే సమస్త విద్యలకు పాదు భారతము పంచమ వేదము ఆ మహా భారత కల్పవృక్షమున పూసిన పారిజాత పుష్పము గీత శోక మోహము లకు వశుడై ధర్మము మరచి కర్తవ్యమును విస్మరించిన తన భక్తుని మిత్రుని అర్జునుని నిమిత్తమాత్రముగ నిల్పి పరమాత్ముడైన శ్రీకృష్ణ పరబ్రహ్మము గీతద్వారా లోకమునకు ధర్మోపదేశ మొసర్చెను వ్యాసుడు గ్రంథస్థము చేసెను వేదములు ప్రభుసమ్మితములు పురాణములు మిత్ర సమ్మితములు కావ్యములు కాంతాసమ్మితములు అని గ్రంథములను మూడు తరగతులుగా విభజించినారు ఆర్యులు అనగా వేదములు రాజాజ్ఞలవలె అధికారయుతముగా ధర్మమార్గములను శాసించును పురాణములు మిత్రులవలె పలికి లోనంగును కావ్యములు కాంతల సరసాలాపవిలాసములవలె హాయి నొసంగునని నుడివిరి

మానవుడు శరీరము మనస్సు ఆత్మల కలయిక కావున ఆనందము కూడ మూడు రకములు శారీరక ఆనందము మానసిక ఆనందము ఆత్మానందము [illegible] శారీరకానందము క్షణికము మానసిక ఆనందము తాత్కాలికము [illegible] శాస్త్రము పుస్తకములలో కొన్ని శ్రవణ పేయములై శరీరమునకు సంతోషము కల్గించును కొన్ని మానసానందము చేకూర్చును పరిపూర్ణమాత్రము పరితృప్తియమైన ఆత్మానందము చేకూర్చును అందువలననే ఒకే ఒక పర్యాయము కిల్లే మాచ పారవేయవలసిన పత్రికములు శ్రీరాము మొదలు పత్తగించవలెను వరకు అనగా అప్పుడప్పుడు మననము చేయవలసిన శాస్త్రములు నిత్యము భక్తి శ్రద్ధలతో పారాయణ చేయవలసిన గ్రంథములు అని మూడు రకముల పుస్తకములు కలవు

విషవృక్షమైన సంసారవృక్షమునకు అమృతోపమానమైన ఫలములు రెండే రెండు కలవు ఆ ఫలయుగ్మమే సజ్జన సహవాసము సత్కావ్య పఠనము ఈ కాలమున సజ్జన సహవాసము లభించుట దుర్లభము సత్కావ్యము లభించుట కష్టము కాదు పుస్తకమును మించిన మిత్రుడు పుడమిలో లేడు ఏది సత్కావ్యమో యోచింతము వక్తృ వైభవము వచో వైభవము వస్తు వైభవముల కావ్యము ఉత్తమమైనది అనగా గ్రంథకర్త ప్రజ్ఞాసమర్థుడై యుండవలెను ఆయన వచో వైభవమును కూడ కలిగియుండవలెను వస్తువు కూడ శాశ్వతమైనదై యుండవలెను ఈ మూడు వైభవములు సిద్ధించినపుడే సర్వజన శిరోధార్యమైన గ్రంథ మవతరించును

కవులు నాలుగు రకములు కవి సత్కవి మహాకవి ఋషి కవి మనస్సుతో రచన మొనర్చును సత్కవి చిత్తముతో సృష్టించును మహాకవి బుద్ధితో బృహత్ కావ్యమును నిర్మించును ఋషి ఆత్మతో ఉత్తమోత్తమ కావ్యమును సృష్టించును అందుచేతనే ఋషికానివాడు కవికాడని కావ్యము రచింపజాలడు అనిరి

వేదములు రెండు భాగములు కర్మకాండ జ్ఞానకాండ ఉపనిషత్తులు జ్ఞానకాండ వానినే వేదాంతము లనియు వేదశిఖరము లనియు శ్రుతిశిరస్సు లనియు పలుకుదురు ఆ ఉపనిషత్తులను గోవులనుగాజేసి అర్జునుని లేగదూడగా నిలిపి శ్రీకృష్ణుడు తానొక గోపాలుడై గీత అను అమృతమును పితికి మనకు అందించినాడు మీరు భోక్తలు కండని ఆహ్వానించుచున్నాడు ఏమి మన అదృష్టము తడవేటికి ఆహ్వానితము రండి శ్రీహరిపాదపద్మమున జన్మించిన గంగలో స్నానమాడినంతనే పుణ్యము కలుగునని ఎంతో శ్రమకోర్చి కాశికి వని గంగలో స్నానముచేయుచుందుముకదా యోగీశ్వరేశ్వరుడు పరమేశ్వరుడైన శ్రీకృష్ణపరమాత్మ ముఖ కమలమునుండి స్రవించిన మకరందధారమైన గీతామృతాపాన లభించు పుణ్యము చెప్పనలవియె నా సమస్త పాపచయమును దగ్ధముచేసి నిత్య నిరతిశయమైన ఆనందము చేకూర్చును

గీత శ్రీకృష్ణుని గృహము శ్రీకృష్ణుని స్వరూపము గీతయే గీతలను ఆశ్రయించుకొని శ్రీకృష్ణుడుండును గీతయే శ్రీకృష్ణుడు గీత యెచట ఉండునో శ్రీకృష్ణు డటనుండును గీతవున్న గృహములో సకల పుణ్యతీర్థములు సమస్త దేవతలు ఉందురు నిశ్చయము రాము దొక

గీతను వ్రాసెను దానికి రామగీత అని పేరు శివుడు వ్రాసిన గీతకు శివ గీత అని నామము కలదు అట్లే వశిష్ఠుడు వ్రాసిన గీతకు వశిష్ఠ గీత అనియు విశ్వామిత్రుడు రచించిన గీతకు విశ్వామిత్ర గీత అనియు దత్తాత్రేయుడు నుడివిన గీతకు దత్తాత్రేయ గీత అనియు పేరుంచినారు. అటులనే ఎన్నియున్నారు కాని శ్రీకృష్ణప్రోక్తమైన గీతకే "భగవద్గీత" అను పేరుంచిరి దీని మహాత్మ్య మూహింపుడు అంతరార్థము గ్రహింపుడు గీత అనినను సుగీత అనినను భగవద్గీత అనినను శ్రీకృష్ణ గీతకే చెల్లును గీతనంతను పఠించుట పరమశ్రేయోదాయకము సాధ్యము కానిచో సగభాగముకాని మూడవవంతుగాని ఆరవవంతుగాని ఒక అధ్యాయముగాని లేదా అందులో సగముగాని ఒక శ్లోకముగాని దానిలో భాగముగాని కనీసము శ్లోకపాదమును చింతన చేసినను పుణ్యమబ్బునని తెలిపియున్నారు గ్రంథములలో శ్రేష్ఠమైన గ్రంథము గీత మానవుల మానసిక గ్రంథుల విచ్ఛేదమొనర్చు గ్రంథము గీత వేదవిభూతి వెలుగుచున్న ఉద్గ్రంథము గీత వేద వేద్యుడైన దైవము తాను స్వయముగా వచించిన గ్రంథము గీత గీతతో తులతూగగల గ్రంథము లేదు ముందురాదు గీతా మాత పరమ పవిత్రము గీతాశాస్త్రము వేదముల సారమే మానసిక క్లేశములను తొలగించు ధర్మ సూక్ష్మము గీతాసారము జ్ఞానోపదేశము చేయు గీతామాతకు పూజ్యభావముతో నమస్కరింపుము

మాత ప్రత్యక్ష దైవము. పదినెలలు మోసి వాత్సల్యముతో పెంచి పోషించుకొని ప్రేమతో సాకి రక్షించి పెద్దచేసిన పరమసాధ్వీమతల్లి కన్నతల్లి పరమపూజనీయకదా. అమ్మె తన కడుపునబుట్టిన బిడ్డలకే పాలొసంగి.

వారినే పెంచి పోషించును కాని గోమాత వనములలో పర్వతములలో సంచరించి సకల మూలికలను మేసి ఆ మూలికలసారమును క్షీరరూపమున తన్నాశ్రయించినవారికి అందరకు అందించి శ్రేయమొనగూర్చును కావున మాతకన్న గోమాత గొప్పదికదా అంతకన్నను దేశమాత ఎంత దొడ్డదో చూడుడు వేద వేదాంత విద్యలు అవతరించిన పుణ్యభూమి వీరవీరాగ్రణుల కన్న వీరమాత కాళిదాసాదికవులను గన్న సాధుచరిత కోరిన వెల్లను దయచేయు కల్పవల్లి కదా దేశమాత మాతకన్నను గోమాత కన్నను దేశమాతకన్నను గీతామాత చాలగొప్పది ఆమె విశ్వమునకే మాత ప్రతి మానవుడు సాధించవలసిన పురుషార్థములు నాలుగు ధర్మ అర్థ కామ మోక్షములు ఈ చతుర్విధ పురుషార్థముల సాధనా కీలకమును బోధించు గీతామాత ఉత్తమోత్తమము కదా ఇది ఉపనిషదర్థ ప్రతిపాదకమును బ్రహ్మవిద్యయును యోగశాస్త్రమును కృష్ణార్జున సంవాద రూపమున ప్రసిద్ధమగు భగవద్గీత దీని భావమును సంగ్రహముగా తెలిపితిమి గ్రహింపుడు

భగవద్గీతావతరణము

భారతయుద్ధము జరుగనున్నది కౌరవ పాండవ బలములు రెండును యుద్ధ మొనరింప ధర్మక్షేత్రమైన కురుక్షేత్రమున ఇరువైపుల ఎదురెదురుగా నిలచియున్నవి ప్రపంచములోని రాజులందరు ఉభయపక్షములు చేరినారు దుర్యోధనునివైపు పదకొండు అక్షౌహిణుల సైన్యము పాండవుల వైపు ఏడు అక్షౌహిణుల సైన్యము మొత్తము పదునెనిమిది అక్షౌహిణుల సైన్యము యుద్ధమునకు సిద్ధముగా మోహరించి నిలుచున్నది కౌరవుల సర్వసైన్యాధ్యక్షుడు భీష్ముడు పాండవుల సైన్యమున కాధిపత్యము ధృష్టద్యుమ్నుడు వహించెను అర్జునుడు తన సారధియై రథమునడుపుచున్న శ్రీకృష్ణునితో రథమును ఉభయసైన్యములమధ్య నిలుపుమని కోరెను శ్రీకృష్ణుడు రథమును ఉభయసేనామధ్యమక్షోణిలో నిలుపగా అర్జునుడు ఉభయ సైన్యములను పరిశీలించెను స్వజనము తాతలు తండ్రులు అన్నలు తమ్ములు కుమారులు మేనమామలు మామలు గురువులు బావమరదులు మొదలగువారు కనుపించిరి వీరిని చంపి నేను సంపాదించునదేమి ఛీ యుద్ధ మొనరింపను అను నిర్వేదము కలిగెను ఆ నిర్వేదము అజ్ఞానజన్యము అస్వర్గ్యము అకీర్తికరమని కృష్ణుడు భావించి తనకు భక్తుడు మిత్రుడు బావయైన అర్జునకు ధర్మోపదేశమొనరించి దివ్యప్రబోధముచేసి జ్ఞానజ్యోతిని వెలిగించి ఐహికసామ్రాజ్యమునకు పారమార్థికసామ్రాజ్యమునకు అర్జును అర్హునిచేసెను ఆ దివ్యప్రబోధామృతమే ఈ గీత

కౌ ర వు లు

ధృతరాష్ట్రుడు పాండురాజు అన్నదమ్ములు ధృతరాష్ట్రుడు పుట్టు గ్రుడ్డి ఆ కారణమున అతనికి రాజ్యాధికారము లేకుండపోయినది పాండురాజునకు పట్టాభిషేకము చేసినారు పాండురాజు అన్నగారిమీది భక్తివిశ్వాసములచేత సింహాసనముమీద అన్నగారినే కూర్చుండబెట్టి తన బాహుబల శౌర్యపరాక్రమములతో రాజ్యమును విస్తరింపజేసెను ధృతరాష్ట్రునకు నూరు మంది కుమారులు కలిగిరి వారె దుర్యోధన దుశ్శాసనాదులు వీరినే కౌరవులందురు

పాం డ వు లు

పాండురాజునకు ఇరువురు భార్యలు కుంతిమాద్రులు అతనికి కుంతివలన ముగ్గురు కుమారులు మాద్రివలన ఇద్దరు కుమారులు కలిగిరి వారి పేరులు ధర్మరాజు భీముడు అర్జునుడు నకులుడు సహదేవుడు. వీరు పాండురాజుకుమారులగుటచే పాండవులనబడిరి అయిదుగురగుటచే పంచపాండవులని పిలువబడిరి

భారత యుద్ధము

దుర్యోధనుడును ధర్మరాజును జూదమాడిరి ఆ ద్యూతనియమము లేమియన ఓడినవారు తమ రాజ్యమును ధనమును సర్వమును గెలిచిన వారికి ఇచ్చి కట్టుగుడ్డలతో అరణ్యమునకు పోవలయును పండ్రెండు సంవత్సరములు అరణ్యవాసమును ఒక సంవత్సరము అజ్ఞాత వాసమును మొత్తము పదమూడు సంవత్సరములు సక్రమముగా గడిపి వచ్చిన తరువాత ఎవరి రాజ్యమును వారు తీసుకొనవలెను ధర్మరాజు జూదములో ఓడిపోయినారు పండ్రెండు సంవత్సరములు అరణ్యవాసము సంవత్సరము అజ్ఞాతవాసమును చేసివచ్చి మా రాజ్యము మాకిమ్మని కౌరవుల నడిగినారు వాడిసూదిమొనమోపు భూమినైన ఈయను అన్నాడు దుర్యోధనుడు అనేకమంది చెప్పినారు వినలేదు కృష్ణుడుకూడ రాయబారము నడిపినాడు. దుర్యోధనుడు చెవినిపెట్టలేదు యుద్ధము తప్పలేదు పదునెనిమిది దినములు ఘోరయుద్ధము జరిగినది ఉభయపక్షముల సైన్యములలోను చాల జననష్టమైనది శ్రీకృష్ణుని సాయమున పాండవులు విజయము గాంచిరి యుద్ధారంభమునందు జరిగిన కృష్ణార్జున సంవాదమే ఈ గీత

గీతావక్త

గీతావక్త శ్రీకృష్ణపరబ్రహ్మమూర్తి ఆయన సర్వజ్ఞుడు సర్వశక్తివంతుడు సాక్షాత్తు పరబ్రహ్మ పూర్ణావతారము లీలామానుష విగ్రహుడు కౌరవ పాండవులకు బంధువు అందుచే ఆయనను దుర్యోధనుడు అర్జునుడు ఇర్వురు యుద్ధమునకు పూర్వము సహాయము కోరినారు శ్రీకృష్ణుడు తన సైన్యమంతనొక భాగమనియు తానొక్కడు ఒక భాగమనియు తన సైన్యము యుద్ధము చేయుననియు తాను యుద్ధము చెయననియు ఆయుధము పట్టననియు చెప్పి ఎవరికి కావలసిన భాగము వారు కోరుకొమ్మనగా అర్జునుడు శ్రీకృష్ణుని కోరెను కృష్ణుని సైన్యము దుర్యోధనుని పరమయ్యెను కృష్ణుడు పార్థసారథియై రథమును నడిపెను అర్జునుడు యుద్ధారంభమున ఖేదము చెంది విషాదయోగములో మునిగి గాండీవమును అస్త్రములను జారవిడిచి ధర్మమును మరచి చేతులు జోడించినపుడు కృష్ణుడు అర్జునునకు ధర్మోపదేశము జ్ఞానోపదేశము చేసెను

వ్యాసమహర్షి - గీతారచయిత

శ్రీకృష్ణపరమాత్మ ముఖకమలమునుండి ప్రవహించిన అమృత ప్రవాహము గీత ఈ గీతాస్రవంతి నిరతిశయానందదాయకము ఇది వ్యాస రచితమైన పంచమవేదమగు మహాభారతములో భీష్మ పర్వమున సారములోనాయకమణివలె గుంఫింపబడినది వ్యాసమహర్షి మహానుభావుడు భగవంతుడు నాలుగుమోములులేని బ్రహ్మ రెండుహస్తములు మాత్రమె కలిగిన విష్ణుమూర్తి ఫాలనేత్రము లేని శివుడు త్రిమూర్తుల కతీతుడు అచ్యుతాంశ సంభూతుడు వేదవిభాగమొనరించి బ్రహ్మసూత్రములు రచించిన సంయమీశ్వరుడు భగవద్ప్రోక్తమైన గీతను రచించి గ్రంధస్థముచేసిన ఋషీశ్వరుడు వ్యాసభగవానుడు భారతమునేకాక బ్రహ్మసూత్రములను అష్టాదశమహాపురాణములను భాగవతమును నిర్మించిన జ్ఞానసముద్రుడు

సంజయుడు

సంజయుడనగా ఇంద్రియములను చిత్తమును జయించినవాడని అర్థము ఈ మహాత్ముడే గీతను ధృతరాష్ట్రునకు వినిపించినాడు సంజయుని తండ్రి గవల్గణుడను సూతుడు ఈయన మంచి విద్యావేత్త ఆయన కుమారుడైన సంజయుడు శాంతుడు శిష్టుడు జ్ఞానవిజ్ఞానసంపన్నుడు సదాచారుడు నిర్భయుడు సత్యవాది జితేంద్రియుడు ధర్మాత్ముడు కృష్ణభక్తుడు అర్జునకు మిత్రుడు వ్యాసభగవానుడు భారత యుద్ధము ప్రారంభమగుటకు పూర్వము సంజయునకు దివ్యదృష్టి నిచ్చి సర్వము ధృతరాష్ట్రునకు వినిపించుటకు నియోగించెను

అర్జునుడు

అర్జునుడు పాండురాజునకు కుంతివలన కలిగిన మూడవ పుత్రుడు అస్త్రవిద్యయందారితేరినవాడు త్రిశూలపాణియైన శివునితో పోరాడి శివుని మెప్పించి పాశుపతాస్త్రమందిన యోధుడు అపజయమెరుగని శూరుడు కృష్ణ సహోదరి సుభద్ర భర్త అసహాయశూరుడైన అభిమన్యుని తండ్రి భారత యుద్ధమున ప్రముఖపాత్ర వహించి కర్ణాది వీరుల సంహరించి విజయలక్ష్మిని చేపట్టిన విజయుడు సార్థకనాముడు శ్రీకృష్ణుని సారధిగా పడయజాలిన పుణ్యుడు కృష్ణునినమ్మిన భక్తుడు అర్జునునకు దశనామములు కలవు అర్జునుడు ఫల్గుణుడు పార్థుడు కిరీటి శ్వేతవాహనుడు బీభత్సుడు విజయుడు జిష్ణుడు సవ్యసాచి ధనంజయుడు

1 అధ్యాయము   అర్జున విషాద యోగము

అర్జునుడు - అచ్యుతా ! ఈ యుద్ధములో నేనెవరి నెదుర్కొనవలయునో యుద్ధసన్నద్ధులై నిలచియున్నవారిని చూచువరకు రెండు సేనల మధ్యను నా రథమును నిలుపుము

కృష్ణుడు - అర్జునా ఉభయసేనల మధ్యమ క్షోణిలో రథము నిలిపితిని చూడుము

అర్జునుడు - యుద్ధముచేయ నిలచిన ఈ బంధువులను చూడగనే నా అవయవములు శిథిలమై పట్టుతప్పి పోవుచున్నవి నోరు ఎండిపోవుచున్నది శరీరము వణకుచున్నది గాండీవము చేజారిపడిపోవుచున్నది అమంగళకరమైన అపశకునములు కనిపించుచున్నవి ఈ స్వజనులందరను చంపి ఏమి శ్రేయవలయునో తోచుటలేదు నేను యుద్ధము చేయలేను బంధువులను చంపలేను పూజ్యులగు గురువర్యులను ఎదిరింపలేను నాకు రాజ్యసుఖము వద్దు విజయము వలదు భోగములపై ఆశలేదు భిక్షమెత్తి జీవించుటకైనను సమ్మతింతును కాని పాపమున కొడిగట్టజాలను

అని రథముపై కూలబడి దుఃఖించుచుండెను

2 అధ్యాయము సాంఖ్యయోగము

కృష్ణుడు – అర్జునా దుఃఖించకుము భయపడకుము హృదయదౌర్బల్యము వీడుము లెమ్ము యుద్ధమొనర్పుము

అర్జునుడు – మహానుభావులైన గురువులను చంపజాలను బిచ్చపుకూడు భుజించవచ్చును కృపణత్వముచే నా స్వభావమంతయు మారి పోయినది ఏది మేలో నిశ్చయించుకున్నాను నీ శిష్యుడను శరణు జొచ్చినాను దేవలోకాధిపత్యము లభించినను నా యింద్రియములను శోషింపజేయు దుఃఖమును పోగొట్టు వస్తువు నాకు కనుపించుటలేదు

కృష్ణుడు చిరునవ్వు నవ్వుచూ పార్థా! అర్థములేని మాటలను అనార్యునివలె పలుకుచున్నావు ఏమి ఈ వృధా ప్రలాపములు చంపుట ఏమి ఈ పార్థివులెవరు గురువులెవరు నీవెవరు ఇంచుక యోచింపుము నేనేనాడుపుట్టితినో ఆనాడే వీరందరు పుట్టిరి నీవు నిమిత్తమాత్రమే నీవు నేను కనుపించుచున్న వారెల్లరు భూజనమందరు జీవులే ఆత్మరూపులే వారందరును నిత్యులే వారిని చంపుట చెల్లరాదనుచుంటివి ఆత్మను అస్త్ర శస్త్రములు ధ్వంసము చేయలేవు ఈ స్థూలదేహమందు బాల్యము యౌవనము ముదిమి కలుగుచున్నట్లే ఆత్మకు వివిధ దేహములు కలుగుచుండును పండితుడు దేహనాశనమునకు విచారింపడు ఆత్మ నిత్యము చంపునది చంపబడునది కాదు మనుష్యుడు చినిగిన వస్త్రములను

విడిచి క్రొత్త వస్త్రములను ధరించునట్లు ఆత్మ జీర్ణములైన శరీరములను విడిచి క్రొత్తశరీరములను పొందుచుండును ఆత్మ ప్రపంచమంతయు నిండియున్నది నాశములేనిది ఆత్మ ఆత్మను నాశమును కలుగజేయువాడు లేడు యుద్ధము చేయుము లెమ్ము ఆత్మను అగ్ని కాల్చజాలదు ఉదకము తడుపజాలదు గాలి శోషింపజేయలేదు ఆత్మ చక్షురాదింద్రియములకు అగపడదు ఏవికారములు ఆత్మకు లేవు యుద్ధముచేయుటకు దుఃఖింపకుము అర్జునా పుట్టి చచ్చి మరల పుట్టు దేహమునే ఆత్మగా భావించినను దుఃఖింపనవసరము లేదు ఏలనన పుట్టినవన్నియు నశించును నశించినవన్నియు మరల పుట్టును అగుచో నీవు దుఃఖింపదగునా ఎపీలికాది బ్రహ్మపర్యంతములు ఉండెడి దేహములందు ఉండు ఆత్మ యెప్పుడును చంపతగినదికాదు భీష్మాదుల కొరకేకాదు సర్వభూతములను నీవు దుఃఖింపతగదు నీవు నీ ధర్మమును గుర్తెరిగి చంపుము క్షత్రియునకు యుద్ధమే ధర్మము యుద్ధములో చనిపోయిన వీరస్వర్గము లభించును జయించిన రాజ్యసుఖమనుభవింతువు సుఖదుఃఖములను లాభనష్టములను జయాపజయములను సమానముగా భావించి యుద్ధమునకు సిద్ధపడుము అప్పుడు పాపమురాదు దేహాభిమానము వీడుము వైరాగ్యమును పొందుము

అర్జునుడు.— కృష్ణా! నీవు చెప్పిన సమాధియందునను బ్రహ్మమునను నిశ్చలబుద్ధిగలవాని స్వరూపమెట్టిది వాడెట్లు పలుకును ఎట్లు కూర్చుండును ఇంకెట్లు నడచును.

కృష్ణుడు – దుఃఖము కలిగినపుడు దిగులు చెందనివాడును సుఖము కలిగినపుడు సంతోషములేనివాడును రాగము భయము క్రోధము లేని మననశీలుడు స్థిత ప్రజ్ఞుడు ఎవడు ఏ విధమైన కోరికలు లేనివాడై శుభాశుభములు కలిగినపుడు సంతోష ద్వేషముల పొందకయుండునో వాని బుద్ధి స్థిరము తాబేలు తన అవయవములను లోనికి ఉపసంహరించుకొనునట్లు ఇంద్రియ గోచరములగు వస్తువులనుండి ఇంద్రియములను మరలించి స్వాధీనము చేసుకొని ఆత్మజ్ఞానము కలగి యెవడుండునో వాడు స్థితప్రజ్ఞుడు కోరికలన్నిటిని విడిచి శరీర జీవనమాత్రమైనను స్పృహలేనివాడై మమత్వము వీడి అహంకార వర్జితుడై సంచరించు జ్ఞాని మోక్షమును పొందును అర్జునా ఇదియే నిష్కామబుద్ధి ఈ బ్రహ్మస్థితి కలవాడు మోహమునకు లొంగడు మోక్షమును పొందును కర్మ భక్తి జ్ఞాన యోగములన్నింటిని వివరముగా నెరిగింతును శ్రద్ధగా వినుము నీసంశయము లెల్లను తీర్తును ప్రశ్నింపుము సంశయింపకుము

౩ అధ్యాయము కర్మయోగము

అర్జునుడు - కృష్ణా శాస్త్రములు కర్మముకన్న జ్ఞానమే గొప్పదగునేని నన్ను ఘోరమగు కర్మమునందు ఎందుకు ప్రేరేపించుచున్నావు కర్మయోగమనగానేమో తెలిపితువా నా ధర్మమేమో వివరింతువా

కృష్ణుడు - అర్జునా ఎవడు ఆత్మయందు ఆసక్తికలవాడై ఆత్మచేతనే తృప్తినొందుచున్నాడో ఆత్మయందే సంతోషము పొందుచున్నాడో వానికి కర్మములవసరములేదు అట్టివానికి పిపీలికాది బ్రహ్మపర్యంతము ఒకానొక ప్రయోజనము సాధింపవలసినదిలేదు నీవు ఫలాపేక్ష లేనివాడవై చేయవలసిన నిత్యకర్మలను ఈశ్వరప్రీతికి చేయుము నీ స్వధర్మము శ్రేష్ఠమని స్మరింపుము పరధర్మము భయావహమని గ్రహింపుము శాస్త్రానుసారమైన కర్మలను లాభమపేక్షింపక అహంకారములేనివాడవై దుఃఖమును మాని యుద్ధమొనరింపుము

4వ అధ్యాయము జ్ఞానయోగము

కృష్ణుడు - అవ్యయమైన జ్ఞానమును సృష్ట్యాదిని నేను సూర్యునకు ఉప
దేశించితిని పురాతనమైన ఆ యోగమునిపుడు నీకు చెప్పెదను
వినుము

అర్జునుడు - సూర్యుని జన్మము ముందు ఎపుడో కలిగినది నీ జన్మము
ఆ వెనుకగదా నీవు సూర్యున కుపదేశించుట ఎట్లు పొసగును

కృష్ణుడు - అర్జునా! నీకును నాకును చాల జన్మలు గతించినవి ఆ జన్మల
నన్నింటిని నేనెరుగుదును నీవెరుగవు నేను సర్వేశ్వరుడనయ్యును
నా మాయచే పుట్టుచుందును అర్జునా ఎప్పుడెప్పుడు ధర్మమునకు
ముప్పు కలుగునో ఎప్పుడెప్పుడు అధర్మము వృద్ధినందునో అప్పుడు
ధర్మ సంరక్షణార్థము నేను అవతరింతును సన్మార్గులను రక్షించుట
కును దుర్మార్గులను నిర్జించుటకును ధర్మము స్థాపించుటకును నేను
ఉద్భవించుచుందును నేనెత్తిన జన్మలన్నింటిని నేనెరుగుదును
నీవెరుగవు జ్ఞానము చాల పవిత్రమైనది కట్టెలను అగ్నిదహించు
నట్లు జ్ఞానాగ్ని కర్మలన్నిటిని భస్మము చేయును జ్ఞానికే ఆత్మ
కాంతి లభించును

5వ అధ్యాయము-కర్మసన్యాసయోగము

అర్జునుడు - కృష్ణా ! కర్మలను విడువుమంటివి మరల కర్మలను చేయమంటివి ఈ రెంటిలో ఏది మంచిదో నిశ్చయముగా తెల్పుము

కృష్ణుడు - అర్జునా ఆలకింపుము భయము కోపము కామాది వికారములను విడిచి వాంఛలను వదలి ఇంద్రియములను మనస్సును బుద్ధిని స్వాధీనమందుంచుకొని మోక్షప్రాప్తిని వాంఛించి విమలమైన జ్ఞానమును కలిగి భగవద్ విశ్వాసముతోనుండుటే కర్మ సన్యాస యోగమని గ్రహింపుము

6వ అధ్యాయము-ఆత్మసంయమయోగము

అర్జునుడు - మనస్సు చాల చంచలముకదా కృష్ణా ! దానిని నిరోధించుట యెట్లు ? ఆత్మసంయమయోగమననేమి ?

కృష్ణుడు - అర్జునా ! నిజమే మనస్సు చాల చంచలమైనది అయినను అభ్యాసముచేతను వైరాగ్యముచేతను నిరొధింపనగును చిత్తమును ఇంద్రియములను స్వేచ్ఛగా చలింపగనీక నిరోధించి సమదృష్టి కలవాడై ఇత్తడిని బంగారమును శత్రువులను మిత్రులను పూజ్యులను అపూజ్యులను ఒకే విధముగా భేదములేని దృష్టితో చూడగల ఉత్తమ జ్ఞానమే ఆత్మసంయమయోగము

7వ అధ్యాయము-విజ్ఞానయోగము

అర్జునుడు - కృష్ణా ! భగవంతుడవైన నిన్ను సేవించు వారందరు విజ్ఞానులేనా ?

కృష్ణుడు - అర్జునా ! నన్ను నాలుగు రకములవారు సేవింతురు ఆర్తులు అనగా తస్కర వ్యాఘ్ర రోగాదులచే పీడితులు జిజ్ఞాసువులు అనగా భగవంతుని తెలియగోరువారు అర్థార్థులు ధనము కోరువారు జ్ఞానులు జ్ఞానము కలిగినవారు వారిలో జ్ఞానులు శ్రేష్ఠులు వేలాది మనుష్యులలో ఒకానొకడు మోక్షసిద్ధికి యత్నించును అట్లు యత్నించిన వారిలో వేయికొకడెవడో ఆత్మను గుర్తించును ఆ గుర్తించిన వారిలో యెవనికో ఒకానొకనికి ఆత్మవిద్య ఫలవంతమగును ఆ ఆత్మజ్ఞాన విజ్ఞానమందిన యోగీంద్రుడు సిద్ధపురుషుడు వేత్త అనఘుడు విజ్ఞుడు ప్రశంసార్హుడు

8వ అధ్యాయము అక్షర పరబ్రహ్మయోగము

అర్జునుడు - కృష్ణా అక్షర పరబ్రహ్మయోగ మననేమి? నరులు మరణ కాలమందేమి చేయవలెను

కృష్ణుడు - అర్జునా! నరుడు అంత్యకాలమున ఏ భావమును స్మరించుచు దేహమును విడుచునో ఉత్తర జన్మమందు ఆ భావనాను చింతనచే వాసితమైన చిత్తము గలవాడై యుండును ఆ భావమునే పొందును కావున అన్ని కాలములయందును నన్ను స్మరించుచుండుము తప్పక నన్నే పొందుదువు

9వ అధ్యాయము-రాజవిద్యారాజగుహ్యయోగము

అర్జునుడు - కృష్ణా! నీవెవరు నీకేమి సమర్పింపవలెను రాజ విద్యా రాజ గుహ్య యోగమును వివరింతువా ?

కృష్ణుడు - అర్జునా! ఈ జగత్తు సృష్టికి నేనేకారకుడను తండ్రిని తల్లిని నేనే కర్మఫలముల నిచ్చువాడను నేనే ఓంకారము నేనే జగత్తును భరించువాడను సంహారకుడను నేనే సమస్తము నేనే నాయందే మనస్సునిల్పి నాకు భక్తుడవై నన్ను పూజింపుము నీ మనస్సును నాయందు లగ్నముచేసిన పరమానంద స్వరూపుడనగు నన్ను పొందుదువు భక్తితో సమర్పించు పత్రమును పుష్పమును ఫలమును తోయమును నేను ప్రీతితో గ్రహింతును

10వ అధ్యాయము-విభూతియోగము

అర్జునుడు - కృష్ణా : నీవు ఎరవి పవిత్రుడవనియు పరబ్రహ్మమవనియు శాశ్వతుడవనియు ప్రకాశరూపుడవనియు సర్వవ్యాపకుడవనియు చెప్పుదురు నీవును చెప్పితివి నీ దివ్యవిభూతి నెఱింగింపుమా

కృష్ణుడు - అర్జునా నా విభూతుల కంతములేదు సర్వభూతములను సృష్టించి భరించి నిర్జించువాడనునేనే సర్వవిభూతికి మూలమునేనే ఈ సర్వము లేని కాలమందును సర్వము నాశనమైన తరువాతను నేనుందును సర్వభూతములకు బీజమునేను చరాచర ప్రపంచములో నేను లేనిదిలేదు దివ్యములగు నా విభూతులకు అంతము లేదు ఈ జగత్తంతయునేనే నాకంటె అన్యముమరేమియులేదని గ్రహింపుము

11వ అధ్యాయము-విశ్వరూపసందర్శనయోగము

అర్జునుడు - కృష్ణా నాయందనుగ్రహించి పరమగోప్యము పరమార్థనిష్ఠము
నైన ఆత్మ తత్వమును నీవెరిగింపగా తెలుసుకొంటిని నీశక్తిని
గ్రహించితిని నీవిశ్వరూపమును మాకగోరుచుంటిని ప్రభువరేణ్యా!
దయతో అనుగ్రహించి చూపుమా

కృష్ణుడు - ఈ చరాచర ప్రపంచమంతయు నా దేహమందె ఉన్నది నేనే
సకలము నా నిజస్వరూపమును నీ తోలుకండ్లు మాకజాలవు దివ్య
దృష్టి నొసగివాడను చూడుము

అర్జునుడు నమస్కారము దేవదేవా! జగములన్నియు సర్వజీవులు నీ
శరీరములోనే చూచుచున్నాను నీ విశ్వరూపమునకు ఆదిమధ్యాంత
ములు కనపడుటలేదు మహాత్మా అనంతా దేవేశా! జగన్నివాసా
నీవు సర్వస్వరూపుడవు దేవా ఎన్నడును చూడని నీరూపమును
చూచి తరించితిని జగన్నివాసా ప్రసన్నుడవు కమ్ము పాహిమాం
పాహిమాం

కృష్ణుడు - అర్జునా! భయమును మానుము సంతోషముతో మరల
యెప్పటి రూపమునే చూడుము

12వ అధ్యాయము-భక్తియోగము

అర్జునుడు - కృష్ణా నమస్కారము నీయందెల్లపుడును విడ్డగలగ భక్తితో నిన్ను ధ్యానించుచుండెడివారా లేక అవ్యక్తము అక్షరమైన పరబ్రహ్మమును ధ్యానించువారా యోగిసత్తములు

కృష్ణుడు - అర్జునా! నాయందు దృఢనిశ్చయము విశ్వాసముకల్గి దూషణ భూషణములను సమానముగా గ్రహించి నిత్యసంతోషముతో సుఖ దుఃఖములను స్వీకరించి మనస్సులో హర్షము ద్వేషములేక మనో నిగ్రహము కలిగి శత్రు మిత్రులయందు మానావమానములయందు శీతము ఉష్ణము దుఃఖము సుఖము కలిగినపుడును సమబుద్ధి గలిగి సంగవర్జితుడై దొరికినదానితో సంతుష్టుడై నా యందు భక్తి గలిగి యుండువాడు శ్రేష్టుడని తెలుసుకొనుము ఇదియే భక్తియోగము

13వ అధ్యాయము క్షేత్రక్షేత్రజ్ఞవిభాగయోగము

అర్జునుడు - కృష్ణా ! ప్రకృతియననేమి పురుషుడనగా నెవరు క్షేత్రమనగానేది క్షేత్రజ్ఞుడనగ నెవరు జ్ఞానమననేమి జ్ఞేయమననేమియో తెలియగోరెదను కేశవా ! దయయుంచి తెలుపుమా

కృష్ణుడు - అర్జునా ఈ అనువు (శరీరము) క్షేత్రము జీవియే క్షేత్రజ్ఞుడు ఏది క్షేత్రమో ఎవరు క్షేత్రజ్ఞుడో తెలియపరచునదే జ్ఞానము జగము మిథ్యా బ్రహ్మ సత్యమని తెలుసుకొనుటయే జ్ఞేయము

14వ అధ్యాయము-గుణత్రయవిభాగయోగము

అర్జునుడు - కృష్ణా ! త్రిగుణములేవి వానినతిక్రమించిన జీవియెట్లుండును

కృష్ణుడు - అర్జునా ! సత్త్వము రాజసము తామసము అను గుణములు మూడును ప్రకృతివలన పుట్టినవగుచు దేహమందు తాదాత్మ్యముగ నున్న ఆత్మను నిబంధించుచున్నవి ఈ మూడు గుణములకు అతీతుడై సుఖదుఃఖములయందు సమానచిత్తుడై ప్రియము అప్రియమునందు ధైర్యముంగలిగి నన్ను ఏకాంతమనుభక్తితో సేవించుచుండువాడు బ్రహ్మత్వమున కర్హుడు

15వ అధ్యాయము పురుషోత్తమప్రాప్తియోగము

అర్జునుడు - కృష్ణా ! పురుషోత్తముడన నెవరు పురుషోత్తమ ప్రాప్తి యోగమననేమి

కృష్ణుడు - అర్జునా క్షరుడు అక్షరుడు అని లోకములో ఇద్దరు పురుషులు గలరు చీమలికాది బ్రహ్మపర్యంతముండు సర్వభూతములు క్షరులు కూటస్థుడు అక్షరుడు ఈయిద్దరికంటెను వేరుగా క్షరుని అతిక్రమించి అక్షరునిమించి పురుషోత్తముడనుగా వేదములయందు ప్రసిద్ధిగాంచి[illegible]న్ని సెవించి పర జ్ఞానవగుము

16వ అధ్యాయము దైవాసురసంపద్విభాగయోగము

అర్జునుడు - కృష్ణా భూతములన్నియు ఒకటేనా ఇందేమైన వ్యత్యాసమున్నదా ?

కృష్ణుడు — అర్జునా భూతములందు రెండు వర్గములు కలవు దైవము అసురము వేదప్రమాణము నంగీకరింపక ధర్మాధర్మరూపవ్యవస్థ లేక స్త్రీ పురుష సంయోగము వలన జగము పుట్టుచున్నదని భావించువారు అసురులు నీతి శాంతి శీలము త్యాగముకల్గి వేదవిధిననుసరించువారు దైవికులు అని గ్రహింపుము

17వ అధ్యాయము శ్రద్ధాత్రయవిభాగయోగము

అర్జునుడు – కృష్ణా! శాస్త్రవిధి నతిక్రమించి శ్రద్ధతో యజ్ఞమునుచేసిన ఆ స్థితి యెట్టిది సత్త్వాశ్రయమా రాజసమా తమోగుణాశ్రయమా తెలుపుమా

కృష్ణుడు – అర్జునా ధర్మమునెరిగి గుణత్రయాంభక్తమైన శ్రద్ధతో మనోవాక్కాయకర్మలతో ఓం తత్ సత్ అను విధానమున శాస్త్రవిధిని చేసిన యజ్ఞము మాత్రమె తత్త్వ ప్రధానము

18వ అధ్యాయము–మోక్షసన్న్యాస యోగము

అర్జునుడు – కృష్ణా సన్న్యాసము యొక్కయు త్యాగము యొక్కయు తత్త్వమును తెలియగోరుచున్నాను

కృష్ణుడు – కామ్యకర్మలను విడుచుట సన్న్యాసమనియు సర్వకర్మముల ఫలములను విడుచుట త్యాగమనియు తెలియుము. అర్జునా సర్వభూతములను తన శక్తిచే యంత్రముమీదనున్న వానిని త్రిప్పునట్లు త్రిప్పుచూ ఈశ్వరుడు భూతముల హృదయమందు ఉండును ఆ ఈశ్వరుడను నేనే నాయందే చిత్తముంచుము నన్నే సేవింపుము నన్నే పూజింపుము నాకే నమస్కరింపుము సర్వ ధర్మములను

విడిచిపెట్టి నన్ను శరణుపొందుము నేను నిన్ను అన్ని పాపముల
నుండి విడిపింతును దుఃఖింపకుము ధర్మమాచరింపుము లెమ్ము
అర్జునా అజ్ఞానమువలన పుట్టిన నీ మోహము నశించినదా

అర్జునుడు — కృష్ణా ! నా మోహమంతరించినది నా సందేహములన్నియు
తీరినవి వేదవేద్యుని నిన్ను కనులార చూడగలిగితిని నీ ఆజ్ఞను
సంపూర్ణ విధేయతతో నిర్వర్తింతును సెలవిమ్ము

కృష్ణుడు — అర్జునా ఈ జగన్నాటకమున నీవొక పాత్రధారివి నీపాత్రను
ధర్మానుసారముగా శ్లాఘాపాత్రముగా నిర్వహింపుము

అర్జునుడు — కృష్ణా అట్లే నా శక్తికొలది సమర్థతతో నిర్వహింతును
నీ ఆజ్ఞానువర్తినై మెలగెదను

కృష్ణుడు — శుభవస్తు ధనుర్ధారివై యుద్ధమొనరింపుము

అర్జునుడు — ధన్యుడను (శంఖమునొత్తి యూదును)

కృష్ణుడు — అర్జునా ! విజయోస్తు — దిగ్విజయోస్తు

ఫలశ్రుతి

ప్రతి దినమును ఈ గ్రంధము పఠించినవారి సంసార బంధములు సడలిపోవును నిత్యమైన నిరతిశయమైన సత్యమైన మోక్ష సామ్రాజ్యలక్ష్మి లభించును

ముగింపు మాటలు

పాఠకులారా భగవద్గీతామహిమను భగవద్గీతా సారమును మీరు సంగ్రహముగా తెలుసుకొనినారు సంపూర్ణముగ తెలియగోరువారు మూల గ్రంధమును ఆమూలచూడముగ సవ్యాఖ్యానముగా గురుముఖమున శ్రవణము చేయవలెయును

లోకములన్నియు జనులందరును సుఖముగా **శాంతిసౌఖ్యములతో వర్ధిల్లుదురు గాక !**

ఓమ్‌తత్‌సత్

సమాప్తము